
# ఆనంద్ ఆత్మహత్య



— ఎ.వి.జి. కృష్ణ

ఆనందు ఆత్మహత్య చేసుకోబోతు న్నాడని విని అదిరిపడ్డాను.

''పదపద'' అన్నాడు వార్తమోసుకొచ్చిన అప్పారావు.

''ఎక్కడికీ?'' అన్నాను కీచుగా, ముత్యాలముగ్గులో ముక్కామల లాగ.

''బీచికి'' అంటూ నన్ను ఈడ్చికెళ్ళాడు. అప్పుడు- సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో సముద్రంలో నాలుగ్గంటలకే దూకుతానని కబురు పంపించాడట ఆనందు. అంటే దూకే సమయానికి బీచిలో జనం ఎక్కువగా వుండకూడదు. కాని శవం ఒడ్డుకి కొట్టుకొచ్చేసరికి మాత్రం బీచి నిండిపోవాలి. అదీ కీర్తికాముకుడు (కీర్తిశేషుడా?) ఆనందు ఐడియా! ''చావు తెలివి!'' అనుకున్నాను. మేం బీచికెళ్ళేసరికి నాలుగేమీ, నాలుగున్నర కూడా అయింది. ఆనందు అయిపు లేడు. కొంపతీసి నాలుగంటే నాలుక్కే దూకేసాడేమో! గోదావరి ఎక్స్‌ప్రెస్ డిపార్చరు టైము కన్నా వీడి డిపార్చరు టైమే కరక్టుగా వున్నట్టుంది!

నేనూ, అప్పారావూ, మరో నలుగురూ కలిసి ఆత్రుతగా చూస్తున్నాం. అదో విధమైన ఆత్రుత అది

ఫలానా రైలుకి వస్తానన్నవాడు రైలొచ్చేక దాంట్లోంచి దిగకపోతే కలిగే ఆత్రుత లాంటిదది. చచ్చిపోతానన్న పెద్దమనిషి సముద్రంలోనూ లేక ఒడ్డునా లేకపోతే, ఒడ్డున పడ్డ చేపల్లా గిలగిలకొట్టుకుంటున్నాం.

అప్పుడు మాక్కనిపించింది సముద్రంలోంచి కొట్టుకువస్తున్న ఆనందు శవం. మాకు గుండెలు కొట్టుకోవడం మానేసాయి. దుఃఖం వస్తోంది.

కన్నీళ్ళు వస్తున్నాయి. అవన్నీ జారి సముద్రంలో పడితే సముద్రంలోని జలం ఒక క్యూబిక్ సెంటీమీటరు ఎక్కువవుతుంది కాబోలు.

చారల షర్టు తొడుక్కున్న శవం నాలుగుసార్లు అటూ ఇటూ ఊగేసరికి మాకు తెలిసిపోయింది అది శవం కాదు, ఒట్టి చొక్కా మాత్రమేనని. అయితే శవం

కాసేపట్లో వేరేగా ఒడ్డుకి కొట్టుకువస్తుందన్నమాట!
మాకు భయం వేసి దూరంగా జరిగి కూచున్నాం.

ఏ సంగతీ ఎంతకీ తేలకపోయేసరికి అక్కడొక బెస్తవాడికీ సంగతి చెప్పి ''మధ్యాహ్నం మా ఫ్రెండు వచ్చాడా?'' అని అడిగేం. మేం రోజూ కూర్చునే స్పాటు అదే. బెస్తవాడికి తెలుసు.

''వచ్చాడు బాబూ, చారల చొక్కా తొడుక్కుని చాలాసేపు చేతుల్తో ముఖం కప్పుకుని కూచున్నాడు. తర్వాత ఎక్కడికెళ్లాడో తెలీదు బాబూ''

''కూడా ఎవరైనా వచ్చారా?''

''లాట్రీ టిక్కెట్లబ్బాయి వచ్చి అలవాటుగా లాట్రీ టిక్కెట్లు ఇచ్చాడు. అప్పుడు మన బాబు ''ఈ వెధవ లాట్రీ టిక్కెట్లు కొనీ కొనీ మా నాన్న పంపిన డబ్బుల్లో నెలకి రెండొందలు తగలేస్తున్నాను. మరి కొన్ను'' అన్నాడు బాబూ. అప్పుడా అబ్బాయి ''పోనీ నువ్వో నాలుగు కొను బెస్తా'' అన్నాడండి''

''కొన్నావా?'' అనడిగేం కోరస్‌గా.

''లేదు బాబు, నేనా అబ్బాయికి దండం పెట్టి ''నాకిలాటివి అలవాటు చెయ్యకు. నాకు నమ్మకం లేదు. నా రెక్కల కష్టం మీదే నాకు నమ్మకం'' అన్నానండి. ''నాకూ అదే నమ్మకం బెస్తా'' అని వెళ్ళిపోయాడు.''

''తర్వాత మన బాబు ఎక్కడికెళ్ళాడు?''

''తెలీదు బాబూ. చొక్కా విప్పేసి దాంతోనే విసురుకుంటూ కూర్చున్నాడు'' అంటూ బెస్త వెళ్ళిపోయాడు విసుగ్గా.

మాకూ విసుగొచ్చింది. ఇంత సముద్రపు టొడ్డుండగా ఆనందంగాడు ఇటేపే కొట్టుకొస్తాడని నమ్మకం ఏమిటి? ఇంటికిపోయి మళ్ళా స్నానం అదీ చెయ్యాలి. జిడ్డు మొహాలతో వున్నాం. తెలిసిన ఆడపిల్లలు ఇక్కడ కనిపిస్తే 'వీళ్ళ అసలు స్వరూపాలు ఇలా బాబూ మోహన్ మొహాల్లా వుంటాయా అని రేపట్నించి మా మొహాలు కూడా చూడరు'' అనుకుంటూ వెళ్ళిపోయాం.

నెల్లాళ్ళు గడిచాయి. అప్పుడప్పుడు ఆనందు గుర్తు కొస్తున్నాడు. ముఖ్యంగా అప్పారావుకి. ఎందుకంటే ఆనందు అప్పారావుకి రెండువందలు బాకీ.

''నాకు చాలా సాయం చేసావురా. నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను'' అని ఆనందు అంటే ''పోనీ మళ్ళీ జన్మలో తీరుద్దుగాన్లే'' అన్నాట్ట అప్పారావు సరదాగా. ఆ సంగతి మాకు చెప్పి అప్పారావు రోజూ విషాదపడేవాడు.

నెలా పదిహేను రోజులకి నేనొకసారి బీచి రోడ్డుమీద ఏదో వెతుకుతూ వెడుతుంటే లాట్రీలబ్బాయి కనిపించాడు. వాడు దగ్గరికి రాగానే ఆనందు గురించి కనుక్కుందామనుకున్నాను.

వాడు దగ్గరకు రాగానే నేను దూరంగా జరిగాను. కారణం, అతను లాట్రీలబ్బాయే గాని పేరు-పేరు ఆనందు. నన్ను చూసి నవ్వుతూ ''ఇంతమంది జనం వుండగా భయమెందుకురా? నేను దయ్యాన్ని కాదు, నేను చచ్చిపోలేదు...'' అనేసాడు.

కొడుకు

**"పెళ్ళికాక ముందు వంట చేయడం నేర్చుకోలేదు – ఇప్పుడు చెయ్యను అని చెప్పిన నీ భర్తని ఇట్టే మార్చేసి ఆయన చేత వంట చేయిస్తున్నావ్- నీకెలా సాధ్యమయింది?"**

**"నేనూ పెళ్ళికాకముందు సంసారం చేయడం నేర్చుకోలేదు – ఇప్పుడు చెయ్యలేనని చెప్పాను. దాంతో ఆయన నా దారిలోకొచ్చేశారు"**

– చెన్నాప్రగడ

''మరి నీ కబురూ, సముద్రంలో షర్టూ అవన్నీ ఏమిటిరా? ఆరోజు తెల్లవార్లూ- అంటే రాత్రి పన్నెండు దాకా నీ కోసం అక్కడే కూచున్నాం'' అన్నాను నేను.

వాడు నవ్వుతూ ''అవును చూశానులే. మీరు ఆరుగంటలదాకా వుండి విసుగ్గా వెళ్ళిపోవడం ఐస్‌పార్లర్‌లో నుంచి చూసాను. ఆహా! ఏం, స్నేహితులు! అనుకున్నాను. రెక్కల కష్టం మీదే నాకు నమ్మకం అని బెస్తవాడే కాక లాట్రీలబ్బాయి కూడా అనేసరికి నాకు షడన్‌గా జ్ఞానోదయం అయింది. ఇన్నాళ్ళూ ఎంత తెలివితక్కువగా ప్రవర్తించానో అర్థం అయింది. చూడూ, బ్రాందీషాపువాడు బ్రాందీ అమ్ముతాడే గాని తాగడు. అలాగే లాటరీ టిక్కెట్లు అమ్మేవాడికి కమీషను మీదే కన్ను కాని లాటరీ టిక్కెట్లు కొని ప్రయిజొస్తే బాగుణ్ణనుకోడు''

''గీతలో భగవానుడు ఏం చెప్పాడు? మనిషి మలిన వస్త్రాన్ని విడిచి మరో బట్ట కట్టుకున్నట్టే. ఆత్మ ఒక శరీరంలోంచి మరో శరీరంలోకి పోతుందని కదా! అలాగే- అంటే ఆత్మ ఒక శరీరం నుండి మరో శరీరంలోకి పోయినట్లే నేను పాత షర్టులోంచి కొత్త షర్టులోకి మారాను. లాటరీలు కొనే షర్టు సముద్రంలోకి పోయింది. లాటరీలు అమ్మే షర్టు-

పడలేదు

**"ధనలక్ష్మీ నిన్ను మొదటి ముద్దు పెట్టుకోబోతున్నాను నువ్వు కళ్ళు తిరిగి పడిపోతావేమో అన్నాడు సత్య మూర్తి తన ప్రేయసితో.**

**"మీకా భయమేమీ అవసరం లేదు! నెప్పుడూ అలా కళ్ళు తిరిగి పడలేదు." అని చెప్పి నాలిక్కొరచుకుంది.**

**– లకనంమూర్తి. కాకినాడ.**

అంటే ఇదే- నన్ను ఒడ్డుకి చేర్చింది. ఏంటలా చూస్తున్నావు? షర్టు బాగుంది కదురా?'' ఆనందు ఆనందంగా నవ్వాడు.

నాకు అదోలా వుంది. ''మరి నీ చదువూ- మానేసావా?'' అన్నాను. మానేసానంటే ఆనందిద్దామని.

''నువ్వు మానేసావా?'' వాడి ఎదురు ప్రశ్న.

''లేదు. పగలంతా చదువుతున్నాను''

''నేను అంతే. పగలంతా చదివి, సాయంత్రం ఇలా రెండు గంటలు లాట్రీ టిక్కెట్లమ్ముతాను. ఈ నెలా పదిహేనురోజుల్నించి రోజుకి పాతిక రూపాయిలు కిడుతున్నాయి. నా కాళ్ళమీద నేను నిలబడు తున్నాను''

నేను వాడి కాళ్ళవయిపు చూసాను. వాడు సాక్షాత్తూ వాడి కాళ్ళమీదే నిలబడ్డాడు. పైగా, వాడి పాదాలు వెనక్కి తిరిగి లేవు!

నాకేమీ తోచక ''నువ్వు లాట్రీ టిక్కెట్లు కొనకపోడమే కాకుండా అమ్మడం కూడా ప్రారంభించి ఆ లాట్రీలబ్బాయి నోట్లో రెండువిధాల మట్టికొట్టావు'' అన్నాను.

''అయితే మా నాన్న నోట్లో మట్టికొట్టమంటావా? చూడొరే, నేనూ మా ఫ్రెండు నోట్లో మట్టికాదు, పంచదార కొడుతున్నాను.''

''ఎలాగరా?''

''ఎలాగంటే ఆ లాట్రీలబ్బాయి ఒక 'లాట్రీ సెంటర్' పెట్టాడు. నేను వాడి దగ్గర పనిచేస్తున్నాను. నాలాంటి వాళ్ళని మరో ముగ్గుర్ని కూడ చేర్పించాను ఆ లాట్రీ సెంటర్‌లో మేం రోజూ సాయంత్రం వెళ్ళి వాడి దగ్గర టిక్కెట్లు తెచ్చుకుని అమ్ముకుంటాం'' అన్నాడానందు.

నేను ఆఖరి అస్త్రంగా ''నువ్వు చచ్చిపోతావన్న రోజున మేం రాత్రి పన్నెండుదాక కూచున్నాం. ఆత్మహత్య చేసుకుంటానని నమ్మించి మోసం చేసావ్'' అన్నాను.

''చెప్పేనుగా, మీరు పన్నెండు దాకా లేరు. సాయంత్రం ఆరుగంటలకే ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు నిర్విచారంగా. స్నేహాలు ఇలా వుంటాయా అనుకున్నాను. ఇక ఆత్మహత్య-నమ్మించి మోసం చెయ్యటం అంటావా. నేనీ లాటరీ వ్యాపారం నా పొట్టకోసమే చేస్తున్నాను. లాటరీ టిక్కెట్లు 'కొనడం' అనే వ్యసనం నుంచి నన్ను నేను తప్పించుకోటానికే ఈ వ్యాపారం చేస్తున్నాను. అది కూడా నాకేమాత్రం ఇష్టం లేకుండానే చేస్తున్నాను. అంటే నా ఆత్మను చంపుకునే చేస్తున్నాను. వస్తా నా బేరాలు పోతాయ్'' అన్నాడు. అని వెళ్ళిపోయాడు బీచిలోకి.

''మొత్తం మీద ఆనందు ఆత్మహత్య చేసుకున్నాడు 'గదా, మాట తప్పలేదు పాపం' అనుకున్నాను. అలా తృప్తిపడ్డాను నేను.